
సాక్షి చిత్తూరు

శనివారం । 26 । అక్టోబర్ । 2024



పశుగణన ప్రారంభం

జిల్లాలో పశుగణన ప్రారంభమైంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలు సేకరించనున్నారు. - 10లో



ఏనుగుల గుంపు హల్‌చల్

పులిచెర్ల మండలంలో ఏనుగులు హల్‌చల్ చేశాయి. కొంగరవారిపల్లె రోడ్డును దాటడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. - 10లో



అట్టహాసంగా ఖోఖో పోటీలు

కాణిపాకం జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో 43వ రాష్ట్ర స్థాయి ఖో–ఖో పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. - 10లో

బోయకొండలోనూ.. పచ్చ దందా!



- ఆలయ టెండర్లను లాగేసుకున్నారు
- రూ.కోట్లు చెల్లించిన వారికీ దిక్కులేదు
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న వ్యాపారులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

టీడీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. భూముల కబ్జాలు, ఇసుక అక్రమ రవాణాతోపాటు వ్యక్తిగతంగా దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇప్పుడు వారి కన్ను బోయ కొండ గంగమ్మ ఆలయ వ్యాపారులపై పడింది. వారిని బెదిరించి వారు పొందిన హక్కులను లాగేసుకుంటున్నారు. దౌర్జన్యంగా వ్యాపారాలు చేస్తున్నారు. వేలంలో రూ.లక్షలు చెల్లించి హక్కులు పొందిన వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న బోయకొండ గంగమ్మ ఆలయాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి చేశారు. రోడ్లు, పార్కు, కల్యాణ మండపం, పుష్కరిణి నిర్మించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించారు. దీంతో భక్తుల సంఖ్య పెరిగింది. ఏటా రూ.5.39 కోట్లు ఆదాయం లభించింది. డీసీ హోదా అధికారి పనిచేసే స్థాయి ఆలయంగా గుర్తింపు పొందింది.

ఏటా టెండర్లు..

ఆలయంలో తలనీలాలు సమర్పించడం, టెంకాయలు, కూల్ డ్రింక్ షాపులు, అమ్మవారి వస్త్రాలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, టోల్ గేట్, లగేజీ కౌంటర్లతో పాటు పాదరక్షలు, కొబ్బరి చిప్పలు, జంతు బలులు సమర్పించే సమయంలో ఇచ్చే తల టికెట్లు, కోళ్ల విక్రయం, అమ్మవారి దారాలు, కలకండ, పేపర్ బ్యాగులు, ఫొటోల విక్రయాలకు సంబంధించిన హక్కు పొందేందుకు ప్రతి ఏటా టెండర్లు నిర్వహిస్తున్నారు. వ్యాపారులు ఏడాది పాటు వ్యాపారం చేసుకునేలా నిబంధనలు పెట్టారు. దీంతో ప్రతి ఏటా ఆలయానికి రూ.కోట్ల ఆదాయం వస్తోంది.

టెండర్ లాగేసుకుని దందా....

టీడీపీ నాయకులు టెండరుదారులను భయభ్రాంతులకు గురిచేసి తమ మనుషులను పెట్టుకుని దందాలు చేయడం ప్రారంభించారు. ఇదేమిటని నిలదీసిన వారిపై దాడులకు దిగుతున్నారు. దీంతో బోయకొండ వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. బోయకొండలో వేలంపాటను దక్కించుకున్న రఘుపతి నాయుడుకు చెందిన టోల్ గేటు, టెంకాయలు, ట్రావెల్స్‌ను టీడీపీ నాయకులు లాక్కున్నారు. ఇందుకుగాను కొంత మొత్తం ఇచ్చారు. అలాగే గంగిరెడ్డికి చెందిన తలనీలాలు, కోళ్ల విక్రయం, శీతల పానీయాలు, క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలను లాగేసుకుని ఆయనకు ఏమీ చెల్లించకుండానే తరిమేశారు. డిష్ సూరికి చెందిన చిన్నబోగం, పెద్దబోగంను లాగేసుకుని ఆయనకు కొంత డబ్బు ముట్టజెప్పారు. తలకాయల వేలంను లడ్డూ రమణ నుంచి లాగేసుకున్నారు. దీంతో ఆలయానికి చెల్లించిన కోట్లాది రూపాయలు వసూలు కాకపోవడం, తెలుగుదేశం వారు నగదు ఇవ్వకపోవడంతో అసలు, వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలే శరణ్యమని వ్యాపారులు వాపోతున్నారు.

వేలంపాటను దక్కించుకున్న వ్యాపారులు..

గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన అప్పటి ఆలయ ఈవో చంద్రమౌళి, చైర్మన్ నాగరాజారెడ్డి ఆధ్వర్యంలో టెండర్ల వేలంపాటను నిర్వహించారు. ఇందులో అధిక మొత్తం రూ.90.04 లక్షలు చెల్లించి తలకాయల వేలంపాటను లడ్డు రమణ కైవసం చేసుకున్నారు. రూ.65 లక్షలకు ఆలయ టోల్ గేట్ టెండర్‌ను రఘుపతినాయుడు దక్కించుకున్నారు. కొండపైకి వెళ్లే భక్తుల వాహనాల టెండర్లను రూ.10 లక్షలకు తీసుకున్నారు. అలాగే టెంకాయలు, పూల టెండర్లను రూ.50.27 లక్షలకు రమణ కైవసం చేసుకున్నారు. పూల హారాలు, వడిబాలు సామగ్రి, చీరలు, జాకెట్ పీస్‌లు కలిపి విక్రయించుకునే హక్కును రఘు అనే వ్యాపారి రూ.40 లక్షలకు దక్కించుకున్నారు. అమ్మవారి తలనీలాలకు సంబంధించిన హక్కును రూ.39.10 లక్షలకు గంగిరెడ్డి అనే వ్యాపారి పొందారు. చిన్నబోగం, పెద్దబోగం టెండర్లను రూ.57.02 లక్షలకు డిష్ సూరి కైవసం చేసుకున్నారు. అలాగే ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్‌లను రూ.6 లక్షలకు డిష్ సూరి పొందారు. గంగిరెడ్డి అనే వ్యాపారి కోళ్ల విక్రయం రూ.4.50 లక్షలు దక్కించుకున్నారు. కొండ కింద కూల్ డ్రింక్ షాపు, క్యాంటీన్ నిర్వహణ హక్కులను రూ.21 లక్షలకు గంగిరెడ్డి పొందారు. కొండ ఆర్చి టికెట్లు గంగిరెడ్డి, ప్రసాద్ కలిసి రూ.7.50 లక్షలకు పొందారు. అమ్మవారి దారాలు, కలకండ వేలం పాటను రూ.66.31 లక్షలకు గంగిరెడ్డి, సురేంద్ర, రెడ్డెప్ప, నరసింహులు కైవసం చేసుకున్నారు. పేపర్ కవర్లు, బ్యాగులు విక్రయించుకునే హక్కును రూ.5.04 లక్షలకు ఆంజనేయులు దక్కించుకున్నారు. ఫొటోలు తీసే వేలంను రూ.1.62 లక్షలకు ప్రసాద్ దక్కించుకున్నారు. పాదరక్షల హక్కును రూ.4.76 లక్షలకు గౌతమ్ దక్కించుకున్నాడు. అలాగే కొబ్బరి చిప్పలు ఏరుకునే హక్కును రూ.7.05 లక్షలకు నరసింహులు పొందారు. సామగ్రి డిపాజిట్ కౌంటర్‌ను రూ.36.40 లక్షలకు నరసింహులు వేలంలో దక్కించుకున్నారు. భక్తులు సమర్పించిన చీరలు, రవికెలు రూ.45 లక్షలకు లలితమ్మ దక్కించుకున్నారు. వీరు ఆలయానికి డబ్బులు చెల్లించారు. తద్వారా రూ.5.39 కోట్ల ఆదాయం లభించింది.



బోయకొండలో వేలం పాటలు నిర్వహిస్తున్న ఈవో చంద్రమౌళి, చైర్మన్ నాగరాజారెడ్డి (ఫైల్)

సీఎంకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

తెలుగుదేశం సీనియర్ నాయకుడు, ఆలయ మాజీ చైర్మన్ ఎస్‌కె.రమణారెడ్డి గత నెల 8న బోయకొండలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ సమయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో తెలుగుదేశం పార్టీ వారు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారని, ఆలయాన్ని కాపాడాలని కోరారు. ఈ విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గంగిరెడ్డి అనే టెండరుదారు తెలుగుదేశం నాయకుల అరాచకాలపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రభుత్వాన్ని, ఈవోను ప్రతివాదులుగా చేర్చారు. ఈ విషయాలు తమకేమీ తెలియదంటు ఈవో పేర్కొనడం హాస్యాస్పదం.

మా దృష్టికి రాలేదు

> టీడీపీ నాయకులు ఆలయ టెండరుదారులను బెదిరించి, వ్యాపారాలు నిర్వహిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతాం. నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం.
>
> – ఏకాంబరం, ఆలయ ఈవో

న్యూస్‌రీల్

రేపు డీఈఓ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా నూతన విద్యాశాఖ అధికారి వరలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె అనంతపురం డీఈఓగా పనిచేస్తూ చిత్తూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. నూతన డీఈఓలు వెంటనే బాధ్యతలు చేపట్టాలని శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ వెబెక్స్ సమావేశంలో ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం విజయవాడలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈ మేరకు నూతన డీఈఓ వరలక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు.

విద్యుత్ సేవా లోపానికి రూ.20.63 లక్షల పరిహారం

చిత్తూరు కార్పొరేషన్: సేవా లోపానికి గాను విద్యుత్ వినియోగదారులకు రూ.20.63 లక్షలు చెల్లించాలని ఏపీఈఆర్సీ ఆదేశించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జూలై–సెప్టెంబర్ వరకు విద్యుత్ సరఫరా, విద్యుత్ స్తంభాలు, లైన్ మార్పు సమస్యలపై ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు 2,521 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించడంలో జాప్యం చేసినందుకు 100 మంది ఏఈల జీతాల నుంచి రూ.20.63 లక్షలు రికవరీ చేయనున్నారు. అలాగే నూతన సర్వీసులు రిలీజ్ చేయడంలో ఆలస్యమైనందుకు, సర్వీసులు రిలీజ్ అయిన పలు కారణాలతో పనులు జరపడానికి అనుమతులు ఇవ్వలేదని వినియోగదారులు ఆరోపించారు. వీటికి చెల్లించాల్సిన పరిహారాన్ని ఏపీఈఆర్సీకి ఉన్నతాధికారులు నివేదించారు. తదుపరి వాటిని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

విద్యార్థులకు అండగా ఉంటాం



హోమ్‌గార్డుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: విద్యార్థులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో హోమ్ గార్డుల పిల్లల సంక్షేమంపై వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి ప్రతి ఒక్కరూ మంచి చదువులు చదువుకుని భవిష్యత్తులో రాణించాలన్నారు. పిల్లల చదువులకు ఏ ఇబ్బందులు వచ్చినా ఆదుకుంటామన్నారు. పోలీసుశాఖ నుంచి హోమ్‌గార్డుల పిల్లలకు ప్రతి ఏటా ఉపకార వేతనాలు ఇస్తున్నామన్నారు. ఇంకా సాయం కావాలంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పదో తరగతి నుంచి బీటెక్ వరకు చదువుతున్న 18 మంది హోమ్ గార్డుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు అందచేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్బీ సీఐ భాస్కర్, ఆర్ఐ సుధాకర్, ఎంటీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తనివ్వం

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2023–24 విద్యాసంవత్సరంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందని విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం ఫీజు కట్టాల్సిందే అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే విద్యార్థుల ఖాతాల్లోకి జమచేస్తామన్నారు. విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తే ఫిర్యాదు చేస్తే వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు.

జిల్లా జడ్జిగా శ్రీనివాసరావుకు పదోన్నతి



పలమనేరు: పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. ఆయన మూడేళ్లుగా పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. లోక్‌అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కరించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోకపోవడం, వృద్ధాశ్రమాలకు పంపడం, ఐసీడీఎస్ ద్వారా బాల్య వివాహాలను అరికట్టడం, లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సివిల్ వ్యాజ్యాలను పరిష్కరించి అన్నదమ్ముల కుటుంబాలను కలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ సేవలను మారుమూల గ్రామాలకు సైతం తీసుకెళ్లారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ భాస్కరయ్య

పుత్తూరు: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రెనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. వడమాలపేటలో శుక్రవారం పుత్తూరు డివిజన్ పరిధిలోని వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పంటల సాగులో ఆధునిక సాగు పరిజ్ఞానాన్ని అందించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. వ్యవసాయ సహాయకులు రైతులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకం చేస్తుండాలని సూచించారు. వర్షపు నీరు, సహజ వనరుల సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల, జీవన ఎరువులు, డ్రోన్ వినియోగం గురించి రైతులకు వివరించడంతో పాటు ఆచరించేలా చూడాలన్నారు. ఫలితంగా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి మాట్లాడుతూ సాగులో చీడలపీడల విజృంభణ, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పుత్తూరు ఉద్యానవన అధికారి వెంకటసౌజన్య మాట్లాడుతూ మామిడి, కూరగాయలు, పూల తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. అనంతరం సిబ్బందికి పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, ఏఓలు విజయ్‌కుమార్, కోదండయ్య, శోభ, హరిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. టెట్ అర్హత కలిగి, కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేదీ లోపు www.jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి ఉచిత బోధనతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై అధికారులు సక్రమంగా స్పందించకపోవడంతోనే మళ్లీ మళ్లీ అర్జీలు వస్తున్నట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అధికారులు గ్రామాలకు వెళ్లకపోవడంతోనే రోజురోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ స్థాయిలోని సమస్యలను ఎంపీడీఓలు పరిశీలించాలని, అక్కడ పరిష్కారం కాని వాటిని జిల్లా స్థాయికి పంపాలని సూచించారు. కుప్పం నియోజకవర్గంలో అధికారులు చురుగ్గా పనిచేయాలని సూచించారు. సచివాలయం, క్షేత్ర స్థాయిలోని అధికారులు పనితీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌసింగ్ పట్టాలపై గ్రామల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. రీ సర్వే, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్, మ్యూటిఫికేషన్ పక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ రవికుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్షణంగా బెల్టు

టీడీపీ కార్యకర్త

అన్నా.. మద్యం షాపు లైసెన్స్ కోసం డబ్బు కట్టాను. మీరొద్దంటే విరమించుకున్నాను. మీకు తెలుసు కదా నా పరిస్థితి. మా చుట్టుపక్కల ఊర్లల్లో బెల్టుషాపులు పెట్టుకుంటాను. మందివ్వండి. అమ్మడు పోయాక రోజూ సాయంత్రానికి డబ్బులు కట్టేస్తాను. ఈ ఒక్క అవకాశం ఇవ్వండన్నా.

మద్యం షాపు యజమాని :

బెల్టు షాపు అంటే ఆషామాషీ కాదు. మద్యం షాపుకంటే ఎక్కువ. బెల్టు షాపులు ఎక్కడ పడితే అక్కడ.. ఎవరికంటే వారికి ఇచ్చేది లేదు. ఒక బెల్టు షాపు పెట్టుకోవాలంటే ముందుగా రూ.లక్ష అడ్వాన్స్ ఇవ్వాలి. లేదంటే వేలం పాట పెడుతాము. ఆ పాటలో ఎంతకు పాడుకుంటావో పాడుకో.

టీడీపీ కార్యకర్త :

అదేంటన్నా.. మీ కోసమే కదా లైసెన్స్ కోసం డబ్బులు కట్టి వదులుకున్నాను. పార్టీ కోసం కూడా కష్టపడ్డాను కదా. ఆ మాత్రం హెల్ప్ చేయ్యలేరా?. వేలం పాట వరకు వద్దులే అన్నా. మీరు అడిగినట్టే రేపు ఒక షాపుకి లక్ష రూపాయలు తీసుకొచ్చి ఇస్తాను.

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ టీడీపీ నాయకులకు వరంగా మారింది. అవకాశం ఉన్న ప్రతి చోటా బెల్ట్ షాపులు ఏర్పాటుచేసి ప్రజల నుంచి సొమ్ము గుంజుకునేందుకు సిద్ధమయ్యారు. తద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు.

- ఊరికో బెల్టు దుకాణం.. షాపుకో పర్మిట్ రూం
- బెల్టు దుకాణానికి రూ.లక్ష ఇవ్వాల్సిందే
- పలుచోట్ల గుట్టుచప్పుడుగా వేలం పాటలు
- షాపుల కోసం కూటమి శ్రేణుల కుమ్ములాట



చిత్తూరులోని ఓ మద్యం దుకాణం

సాక్షి టాస్క్‌ఫోర్సు: ప్రశాంతతకు మారుపేరైన పల్లెల్లో మద్యం ఏరులై పారనుంది. ఊరికో బెల్టు షాపు ఏర్పాటు చేసేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా బెల్టు దుకాణం ఏర్పాటుకు రేటు నిర్ణయించారు. మరో వైపు నగరాలు, పట్టణాల్లో పర్మిట్ రూంలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా చిత్తూరు నగరంలో ఇప్పటికే పర్మిట్ రూంలు ఏర్పాటు చేసేశారు. నూతన మద్యం పాలసీ విధానం ద్వారా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 331 దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. టెండర్లు దక్కించుకున్న కొందరిని కూటమి నేతలు భయపెట్టి, ప్రలోభపెట్టి అనేక మద్యం దుకాణాలను లాక్కున్నారు. మరికొందరిని బెదిరించి దుకాణాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారు.

నయా దందా!

పెట్టుబడితో పాటు లాభార్జనే లక్ష్యంగా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రతి దుకాణానికీ ఒక్కో బెల్టు షాపు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంకొందరు మద్యం సిండికేట్లు ప్రతి పల్లెలోనూ బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో బెల్టుషాపులను కేటాయించడం, వసూళ్ల పర్వంలో వైన్స్‌షాపుల నిర్వాహకులు, తెలుగు తమ్ముళ్లు సరికొత్త దందాకు తెరలేపారు. పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తమ్ముళ్లు బెల్టు షాపుల కేటాయింపులో నిమగ్నమయ్యారు. బెల్టు షాపుల ఏర్పాటులో టీడీపీ నేతల మధ్య పోటీ పెరగడంతో గ్రూపు తగాదాలు మొదలయ్యాయి. ఒక బెల్టుషాపు కేటాయించాలంటే లక్ష రూపాయాలు తమ్ముళ్లకు చెల్లించాలనే నిబంధన పెట్టారు. లక్ష రూపాయలు ముందుగా అడ్వాన్స్ చెల్లించిన వారికే బెల్టు షాపు కట్టబెడుతున్నారు. ఒక పల్లెలోనే ఇద్దరు ముగ్గురేసి పోటీపడుతుండడంతో బెల్టు షాపులకు డిమాండ్ పెరిగింది. దీంతో కొన్ని చోట్ల వేలంపాట నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఇలా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో లక్ష రూపాయలు ఇచ్చిన వారికి బెల్టు షాపు, డిమాండ్ ఎక్కువ ఉంటే.. వేలం పాట ద్వారా కట్టబెడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న బెల్టు దుకాణాల ఏర్పాటుపై పల్లెజనం భగ్గుమంటున్నారు.

చిత్తూరు ..అదే జోరు

- చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గంలో మద్యం దుకాణ యజమానులు, తమ్ముళ్లు కలిసి బెల్టు షాపుల ఏర్పాటుకు వసూళ్లకు దిగుతున్నారు. ఒక్కో షాపునకు లక్ష రూపాయల చొప్పున వసూలు చేసి బెల్టు దుకాణాలు కట్టబెట్టేస్తున్నారు.
- చిత్తూరు నగరంలో 14 మద్యం దుకాణాలుంటే.. ఒక్కో షాపు నిర్వాహకుడు ఒక్కో పర్మిట్ రూం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకుని ఎక్కువ మందిచేత వీలైనంత ఎక్కువ మద్యం కొనుగోలు చేయించి తాగించేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు.

పర్మిట్ రూంలు.. ఆర్భాటాలు

చిత్తూరు, తిరుపతి నగరాల్లో మద్యం దుకాణాల యజమానులు పర్మిట్ రూంలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పర్మిట్ రూంలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నా.. అధికారపార్టీ నేతలు బరితెగిస్తున్నారు. చిత్తూరులో 14 మద్యం షాపులు ఉంటే.. ప్రతి దుకాణ యజమాని పర్మిట్ రూం ఏర్పాటు చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. అలా కొందరు అధికరపార్టీ నేతలు నగరంలో పర్మిట్ రూంలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం తాగించి సొమ్ము చేసుకునేపనిలో నిమగ్నమయ్యారు. తిరుపతి నగరంలో పర్మిట్ రూంలు ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు. పర్మిట్ రూంల బాధ్యతలు ఎవరికి అప్పగించాలి, పర్మిట్ రూం ఏర్పాటుకు నిర్వాహకుడి నుంచి ఎంత వసూలు చేయాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పశుగణన ప్రారంభం

- జిల్లాలో ఫిబ్రవరి 28 వరకూ కొనసాగనున్న ప్రక్రియ
- సర్వేలో 388 మంది ఎన్యూమరేటర్లు
- యాప్‌లో వివరాలు నమోదు
- పక్కాగా చేపట్టాలని పశుసంవర్ధకశాఖ అధికారుల ఆదేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లాలో పశుగణన ప్రారంభమైంది. ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలను సేకరించి ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ నాలుగు నెలలు జరగనుంది. ఈ జాతీయ పశు గణన శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. ఇందులో 388 మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటున్నారు. ప్రక్రియలో ఆవులు, గేదెలతో పాటు పశు సంవర్ధక శాఖ పరిధిలో ఉన్న పలు జీవాలను గణించనున్నారు. సర్వే పక్కాగా చేపట్టాలని పశుసంవర్ధకశాఖ అధికారులు ఆదేశాలిచ్చారు.

ఐదేళ్లకొకసారి పశుగణన

చిత్తూరు జిల్లాలో శుక్రవారం నుంచి పశుగణన ఆరంభమైంది. దీనికి పశు సంవర్ధక శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తక్కువ కాల వ్యవధిలో పశువుల జననాలు, మరణాలు పెద్ద ఎత్తున జరుగుతుండడం, వ్యాపార నిమిత్తం పశువులను వివిధ ప్రదేశాలకు తరలిస్తుండడం వంటి కారణాలతో పశువుల గణాంకాల్లో తరచూ మార్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐదేళ్లకు ఒకసారి పశుగణన చేస్తుంటారు. గతంలో 2019లో పశుగణన చేశారు. తిరిగి 2023లో జరగాల్సి ఉండగా ఏడాది ఆలస్యమైంది. ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 1న నిర్వహించాలని ముందుగా నిర్ణయించినా వర్షాలు, వరదల ప్రభావంతో ఆలస్యం జరిగింది. జిల్లాలో మొత్తం 988 రెవెన్యూ గ్రామాలు ఉండగా 4,60,076 కుటుంబాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పశు గణన కోసం మొత్తం 384 మంది ఎన్యూమరేటర్లు, 67 మంది సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించింది. వీరు ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలను సేకరిస్తారు. వాటిని సెన్సస్ మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. పశుగణన మొబైల్ అప్లికేషన్ వినియోగంపై ఆగస్టులో నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం మొదలైన పశు గణన వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకూ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లతో పాటు వీధి కుక్కలు, ఆంబోతులను సైతం లెక్కించనున్నారు. జిల్లాలో 2019లో నిర్వహించిన పశుగణన ప్రకారం ఇప్పటి వరకూ ఆవులు 5,40,523, గేదెలు 4,910, గొర్రెలు 5,01,947, మేకలు 2,08,149, పందులు 386 ఉన్నాయి. గుడ్లు పెట్టే లేయర్, బ్రాయిలర్, నాటు కోళ్లతోపాటు వివిధ రకాల కోళ్లు 80 లక్షల వరకూ ఉన్నాయి.


పశుగణన చేపడుతున్న ఎన్యూమరేటర్

ఉపయోగాలు ఇలా....

- పశుగణన చేయడం వల్ల గ్రామం, మండలం, జిల్లాలో పశువుల సంఖ్యపై సంబంధిత శాఖ వద్ద పక్కా డేటా ఉంటుంది. దీనివల్ల సీజనల్‌గా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పెరటి కోళ్లు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఎన్ని టీకాలు, వ్యాక్సిన్లు అవసరం, నిల్వ ఉంచాల్సిన టీకాలు, వ్యాక్సిన్లు ఎన్ని కావాలి అన్న దానిపై స్పష్టమైన అంచనా ఉంటుంది.
- పశు పోషణపై ఆధారపడే కుటుంబాలు, పాడి రైతులు, దీనిపై ఆధారపడే మహిళలు, వారికి కల్పించాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై బడ్జెట్ రూపకల్పనకు పశుగణన ఉపయోగపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీకి అవకాశం కలుగుతుంది.
- పశు పోషణ, గొర్రెల పెంపకం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, చిన్న చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, దానా, పచ్చిమేత కమతాలకు ఇవ్వాల్సిన రాయితీపై ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం కలుగుతుంది.
- పశు సంతతి తక్కువగా ఉన్నచోట పశువుల సంఖ్యను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు అందించాల్సిన రాయితీలు, ప్రోత్సాహంపై అవగాహన ఉంటుంది.
- ఆవులు, గేదెల ద్వారా వచ్చే పాలు, వాటి అనుబంధ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాల కల్పన, ప్రైవేట్ డెయిరీల ప్రోత్సాహం, అవసరమైతే పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించవచ్చు.
- ప్రధానంగా పశు సంతతి వృద్ధికి బ్రీడింగ్, ఆర్టిఫిషియల్ స్పెర్మ్ నిల్వలపై ఒక అంచనా ఉంటుంది.
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశువుల తరలింపు, వాటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. పశువులకు అందించాల్సిన దానా, పచ్చిమేత ఎంత మేరకు అందుబాటులో ఉంచాలన్న దానిపై ముందే అంచనా వేసుకోవచ్చు.
- గొర్రెలు, మేకల గణాంకాలతో మాంసం ఉత్పత్తిపై ఒక అవగాహన కలుగుతుంది. అలాగే వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు వేయాల్సిన వ్యాక్సిన్, మందులు, పిల్లలు పుట్టకుండా చేసే ఆపరేషన్లపై ఒక అంచనా వస్తుంది.

పక్కా గణన ఇస్తే ప్రయోజనం



21వ జాతీయ పశుగణన ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా పక్కాగా నిర్వహించాలని అధికారులు, ఎన్యూమరేటర్లకు ఆదేశాలు జారీ చేశాం. పశువుల వివరాలను యాప్‌లో నమోదు చేయడంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. పశుగణన సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంది. దీనికి పాడి రైతులు సహకరించాలి. కచ్చితమైన సమాచారం ఇవ్వడం వల్ల వారికే ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయాన్ని గ్రహించి ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలి. అప్పుడే రాయితీలు, వివిధ మందులు, ప్రోత్సాహకాలు అందించేందుకు వీలుంటుంది.

– ప్రభాకర్, పశుసంవర్ధకశాఖ జేడీ

క్లుప్తంగా

భార్యపై భర్త దాడి


గాయపడిన మునెమ్మ

పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లెలో శుక్రవారం కుటుంబ అవసరాలకు డబ్బులు అడిగిన భార్యపై భర్త ఇటుక రాళ్లతో దాడి చేశాడు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. గ్రామంలో మునీశ్వర్, మునెమ్మ(36) దంపతులు నివాసం ఉంటున్నారు. మునెమ్మ కుటుంబ ఖర్చుల కోసమని భర్తను డబ్బులు అడిగింది. దీంతో ఆగ్రహం చెందిన అతను ఆమెపై ఇటుక రాళ్లతో దాడి చేశాడు. గాయపడిన ఆమెను స్థానికులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం


శిరీష

ఐరాల: మండలంలోని బెస్తపల్లెకు చెందిన ఎం.దేవేంద్ర, భార్య ఎం.శిరీష అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆమె ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం వివాహిత తండ్రి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు రిమాండ్


రిమాండ్ విధించిన వారితో పోలీసులు

నగరి : ఇళ్లలో చోరీకి పాల్పడిన నిందితులకు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ 15 రోజులు రిమాండ్ విధించారు. సీఐ మహేశ్వర్ కథనం మేరకు.. నగరి మండలంలోని తడుకుపేటలో మూడు రోజుల క్రితం దుండగులు ఒక ఇంట్లో దూరి రెండు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు తమిళనాడుకు చెందిన వెట్రోవెల్ అలియాస్ వేలు (21), బాలచందర్ (21), విజయ్ కుమార్ (24)ను పొన్నాడి చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ నెల 1వ తేదీన అరక్కోణం నుంచి మండలంలోని ఓజీకుప్పం గ్రామానికి గంజాయి కొనడానికి వచ్చిన నరేంద్రన్ అలియాస్ అజిత్ (21), హుస్సేన్ (23), రోహిత్ (22) డబ్బు చాలకపోవడంతో తడుకుపేట జగనన్న కాలనీ వద్ద ఒక జంటను బెదిరించి రూ.2000 దోచుకున్నారు. వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారికి ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ 15 రోజులు రిమాండ్ విధించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్ట అటవీప్రాంతంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.2.42 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.



ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి


కార్తీక్(ఫైల్)

గుడిపాల: మండలంలోని పశుమంద గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రామ్మోహన్ కథనం మేరకు.. మండలంలోని పశుమంద ఎస్టీ కాలనీకి చెందిన కార్తీక్(32) పశుమందకు చెందిన చెంగమ నాయుడు రైతు వద్ద కూలి పనులు చేస్తున్నాడు. అతను శుక్రవారం చెంగమనాయుడు ట్రాక్టర్‌ను తీసుకుని మామిడి తోపులో దున్నుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్ కింద కార్తీక్ పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కార్తీక్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు చిన్నపిల్లలు కావడంతో ఎస్టీ కాలనీ వాసులు బోరున విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్లూరులో ఏనుగుల గుంపు హల్‌చల్

కల్లూరు (రొంపిచెర్ల): పులిచెర్ల మండలంలోని కొంగరవారిపల్లె రోడ్డులో శుక్రవారం ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. చుట్టుపక్కల గ్రామ ప్రజలు భయందోళన చెందారు. వారం రోజుల క్రితం పీలేరు మండలం బందార్లపల్లెకు చెందిన చిన్న రాజారెడ్డి(65) ఏనుగుల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. అధికారులు ఏనుగులను అక్కడి నుంచి తరిమేశారు. అవి శుక్రవారం కల్లూరు సమీపంలో రోడ్డు దాటాయి. దీంతో కల్లూరు పోలీసులు, అటవీ శాఖ అధికారులు వాహనాలను పీలేరు మీదుగా దారి మళ్లించారు. ఏనుగులను అడవిలోకి పంపేందుకు రెండు జిల్లాల అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేసున్నారు. రెండు నెలలుగా పులిచెర్ల, సదుం మండలాల్లో ఏనుగులు గుంపు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇంత వరకు తమకు నష్ట పరిహారం ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు.

మోల్డింగ్ షీట్లు కడుతూ కింద పడి యువకుడు మృతి


మృతుడు అహ్మద్‌బాషా

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మోల్డింగ్ సీట్లు కడుతూ కింద పడి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బాలుర ఉన్నత పాఠశాలలో రూ.15 లక్షలతో సైన్సు ల్యాబ్ గది నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో పైకప్పుకు మోల్డింగ్ వేసే పనులు చేస్తున్నారు. మండలంలోని బండకిందపల్లెకు చెందిన ఎస్.అహ్మద్‌బాషా(19) శుక్రవారం మోల్డింగ్ సీట్లు కడుతూ కాలు జారి కింద పడ్డాడు. తీవ్ర గాయపడిన అతన్ని తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక


జిల్లా వెయిట్ లిఫ్టింగ్ జట్లు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వడమాలపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఎంపికైన జట్లు గుంటూరు జిల్లాలో నవంబర్ 2వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్.బాబు తెలిపారు. పీడీలు చంద్రశేఖర్‌రాజు, పుష్పవాణి, సాయిసుమతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా బాలికల జట్టులో అశ్విని, మానస, మృదువర్షిని, పల్లవి (తిరుపతి), రమ్య, సరస్వతి (రేణిగుంట), మానస, అన్నపూర్ణ, సుమిత్ర, యశ్వంతి (వడమాలపేట) ఉన్నారు. బాలుర జట్టులో సతీష్ (పల్లం), గురుదిలీప్, శంకర్, శేఖర్, ఉదయ్‌కుమార్, మగ్దుమ్‌అలీ, సతీష్, శ్రావణ్‌కుమార్, వినయ్‌కుమార్, అనీష్, హర్షవర్ధన్ (వడమాలపేట) ఉన్నారు.

డీఎడ్ అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డీఎడ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నవంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు డీఎడ్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు (2018–2020 బ్యాచ్ అభ్యర్థులు), డీఎడ్ రెండవ సెమిస్టర్ (2023–25) బ్యాచ్‌కు చెందిన వారికి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా జిల్లాలో ల్యాంగ్వేజ్ పండిట్ కోర్సు చదివే వారు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ తెలిపారు. ఎల్‌పీటీ, హెచ్‌పీటీ రెగ్యులర్, వన్స్ ఫెయిల్డ్ అభ్యర్థులకు పరీక్షల తేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 31వ తేదీలోపు ఫీజు చెల్లించాలన్నారు. మూడు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ అప్‌డేట్ చేసేందుకు ఈ నెల 22వ తేదీ నుంచి వెబ్‌సైట్ అందుబాటులో ఉందని వెల్లడించారు.

నవంబర్ 11 లోపు టెన్త్ ఫీజు చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద నడుస్తున్న ఉన్నత పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజును నవంబర్ 11వ తేదీలోపు చెల్లించాలని డీఈఓ దేవరాజు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి అధికంగా ఫీజులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామన్నారు. నవంబర్ 11వ తేదీలోపే నామినల్ రోల్స్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 12 నుంచి 18 వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో నవంబర్ 19 నుంచి 25 వరకు, రూ.500లతో నవంబర్ 30వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, మూడు సబ్జెక్టులు కంటే ఎక్కువ అయితే రూ.125, మూడు సబ్జెక్టులకంటే తక్కువ ఉంటే రూ.110, వొకేషనల్ విద్యార్థులు పరీక్ష ఫీజుకు రూ.60 అదనం, అండర్ ఏజ్ విద్యార్థులు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరమైన వారు రూ.80లు చెల్లించాలని తెలిపారు.

చిరుత ఘటనలో ఐదుగురు నిందితుల అరెస్టు


నిందితులను చూపుతున్న డీఎఫ్‌ఓ భరణి, ఎఫ్‌ఆర్వో బాలకృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: యాదమరి మండలం తాళ్లమడుగు సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుతను హతమార్చిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎఫ్‌ఓ భరణి తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక చిత్తూరు వెస్ట్ రేంజర్ కార్యాలయంలో నిందితులు, చిరుత శరీర భాగాలను చూపారు. ఆమె మాట్లాడుతూ చిరుతను చంపిన వారిలో అనుమానితుడిగా బంగారుపాళ్యం మండలం సీజేఎఫ్‌ఎస్ కాలనీకి చెందిన వినాయకంను అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో అతను ఇచ్చిన సమాచారం మేరకు బంగారుపాళ్యం మండలం వెలుతురుచేనుకు చెందిన ధర్మయ్య, మణికంఠ, వినాయకం, రాజామణి, మాణిక్యంను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి చిరుత పాదాలు, పళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని 3వ అదనపు జడ్జి ఎదుట హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని తేనెబండలో గురువారం రాత్రి ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు.. తేనె బండకు చెందిన మురళి (29) కొంతకాలంగా నగరంలోని మార్కెట్ చౌక్‌లో ఉన్న ఒక చికెన్ సెంటర్లో పనిచేస్తున్నాడు. ఇటీవల ఇతనికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంటి పైకప్పుకి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న జిల్లా ఖో-ఖో క్రీడాకారులు

ఐరాల: మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో 43వ రాష్ట్ర స్థాయి బాలబాలికల జూనియర్స్ ఖో–ఖో పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో 13 జిల్లాలకు చెందిన 312 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. ఈ పోటీలను పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఖో–ఖో అసోసియేషన్ కార్యదర్శి సీతారామరెడ్డి, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్ బాబు, జిల్లా ఖో–ఖో కార్యదర్శి శరత్ పాల్గొన్నారు.

బాలికల విభాగంలో తొలిరోజు విజేతలు వీరే

మొదటి రోజు బాలికల విభాగంలో అనంతపురం, చిత్తూరు జిల్లాలు తలపడగా చిత్తూరు జిల్లా జట్టు 8–3 తేడాతో గెలుపొందింది. పశ్చిమ గోదావరి జట్టు కడపపై 8–7 తేడాతో, విశాఖపట్నం జట్టు గుంటూరుపై 14–08 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి. అలాగే శ్రీకాకుళం జట్టు విజయనగరంపై 9–03 పాయింట్ల తేడాతో గెలుపొందింది. **బాలుర విభాగంలో..** నెల్లూరు, కడప జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్ 11–11 పాయింట్లతో డ్రాగా ముగిసింది.

ప్రభుత్వ ఉద్యోగికి మూడు నెలల జైలు

పుంగనూరు: మహిళ వద్ద తీసుకున్న అప్పును ఏళ్ల తరబడి చెల్లించని ప్రభుత్వ ఉద్యోగికి పుంగనూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ మూడు నెలల జైలు శిక్ష విధించారు. న్యాయవాది బి.వెంకటముని కథనం మేరకు.. పుంగనూరులోని ప్రభుత్వ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.రామకృష్ణ పట్టణానికి చెందిన టి.శ్రీలత వద్ద 2015లో రూ.5 లక్షలు అప్పు తీసుకున్నాడు. దానికి ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. ఎంతకూ అప్పు తిరిగి చెల్లించకపోవడంతో శ్రీలత పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేశారు. విచారించిన కోర్టు పిటిషనర్ శ్రీలతకు వడ్డీ, అసలుతో కలిపి రూ.7 లక్షలు చెల్లించాలని 2018లో తీర్పు ఇచ్చింది. రామకృష్ణ డబ్బు చెల్లించకపోవడంతో పిటిషనర్ తిరిగి కోర్టును ఆశ్రయించారు. రామకృష్ణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తేలడంతో శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ ఉద్యోగి రామకృష్ణకు మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

నలుగురు ఆటో దొంగల అరెస్టు

ఆరు ఆటోలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఆటోలు

వి.కోట : ఆటోలను చోరీ చేస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. వి.కోట, పరిసర ప్రాంతాల్లో ఆటోలు చోరీకి గురవుతున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని కనమనాయనపల్లి హంద్రీనీవా కాలువ వద్ద 2 ఆటోల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు వి.కోటలోని బాపూజీ వీధికి చెందిన చాన్‌బాషా కుమారుడు ముస్సవీర్ అలియాస్ సోను (19), లేట్ మహ్మద్ సాబ్‌లాల్ కుమారుడు జబీ(31), ఖాజీపేటకు చెంది ప్రస్తుతం మసీదు వీధి ఉంటున్న లేట్ బాబు కుమారుడు సల్మాన్ ఆలీయాస్ సల్లు(22), వేణుగోపాల స్వామి గుడి వీధికి చెందిన రహమాన్ అలియాస్ సుభాన్ ఆటోలను చోరీ చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు అంగీకరించారు. వారిని అరెస్టు చేసి రూ.10 లక్షల విలువైన 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులను పట్టుకున్న వి.కోట పోలీసులను ఎస్పీ మణికంఠ, డీఎస్పీ ప్రభాకర్ అభినందించారు.